# గెలుపులోని ఓటమి

ఆ రోజున రాత్రిపూట భోజనం చేస్తుండగా ఉదయం పోస్టులో వచ్చిన శుభలేఖ గురించి చెప్పింది మాధురి. అప్పటికి గంట క్రితమే ఆఫీసుకు సంబంధించిన ఆడిటింగ్ పూర్తిచేసి అలసిపోయి విసుగ్గా ఉన్న నాకు పెళ్ళి ప్రయాణం గురించి తలచుకోగానే మరింత నీరసం వచ్చేసింది.

"రెండు రోజులన్నా ముందర వెళ్ళకపోతే బాగుంటుందంటారా" అంది మాధురి.

"ఆలోచిద్దాం" అన్నట్టు తలాడించాను మౌనంగా.

అప్పటికి ఇంకా నన్ను విసిగించటం ఇష్టంలేక ఆ ప్రస్తావన అంతటితో ఆపేసింది నా శ్రీమతి. మర్నాడు పిల్లలిద్దరికి రెండు జతల బట్టలు, శ్రీమతికి రెండు మేచింగ్ బ్లౌజులు వగైరాల్తో షాపింగ్ పూర్తి చేశాం. రోజుకంటే ముందుగానే భోజనాలు అయ్యాయనిపించాం. పిల్లలిద్దరూ నిద్రపోయారు.

రెండు సూట్‌కేసులు, రెండు వైరుబుట్టలు, ఒక హేండ్ బ్యాగ్ ముందర పెట్టుకుని బీరువా తెరిచి కూర్చుంది మాధురి.

"ఇదిగో! అక్కర్లేనివన్నీ సర్ది లగేజి పెంచకు మోయలేక అవస్థపడాలి" అని హెచ్చరించాడు.

"అక్కర్లేనివేమీ సర్దను లెండి.... నన్ను కంగారుపెట్టి మీరు కంగారు పడకండి ... అంది మాధురి చిరుకోపం నటిస్తూ.

ఆమె ముందరేసుకున్న పెట్టెలు బుట్టలు అన్నీ నింపేస్తుందని భయం వేసి నేను కూడా వెళ్ళి ఆమె పక్కన కూర్చున్నాను. అప్పటికే ఆమె ఒక పెట్టె నిండా బట్టలు కుక్కేసి రెండో పెట్టెలో మరి కొన్ని అమరుస్తోంది.

"ఇవిగో! తువాళ్ళు ఇన్ని ఎందుకు? రెండు మాత్రం ఉంచి మిగిలినవి తీసెయ్...." అంటూ లోపలున్న టవల్స్‌ను బయటకు తియటానికి ప్రయత్నించాను. నా మాటలకు, చేష్టలకు అడ్డుపడింది మాధురి.

"మీకు తెలియదులే.... మీరు ఊరుకోండి. సాన్నాలు చేసి వాళ్ళనీ వీళ్లనీ తువ్వాళ్లు అడిగితే అసహ్యంగా ఉంటుంది. రెండు రోజులు ఉండేలా వెళ్తున్నప్పుడు మనక్కావలసినవన్నీ మనం తీసుకెళ్తేనే మర్యాదగా ఉంటుంది" అంటూ చిన్న ఉపన్యాసం దంచింది మాధురి.

పౌడరు డబ్బా, తిలకం సీసా, అద్దం, దువ్వెన... వగైరా సామాన్లతో మరో హేండ్ బేగ్ నింపింది. అవన్నీకాక నా ప్యాంటు, షర్టు రెండు జతలుకూడా సర్దింది.

"సరే. పిల్లలకు ఇంకా ఏవైనా కావాలంటే సర్దుకో! నాకేం అభ్యంతరంలేదు. నాకు మాత్రం నేను వేసుకువచ్చే డ్రెస్

సరిపోతుంది. ఒక లుంగీ, బనియను మాత్రం సర్దుచాలు" అన్నాను.

"ఇదిగో ! మీరు నన్ను విసిగించకుండా అవతలకు వెళ్ళండి ప్రయాణంలోనే వేసుకున్న బట్టలు నలిగిపోతాయి. తరవాతకూడా వాటితోనే తిరుగుతారా... అదేం కుదరదు"అంది మాధురి మొండిగా.

"నువ్వుఇన్ని సామాన్లు తీసుకువస్తున్నావు కదా. వీటిల్లో ఏ ఒక్కదానితోనూ పనిలేకుండా వెళ్లి తిరిగిరాగలను నేను! ధైర్యం ఉంటే నాతో పందెం కట్టు" అన్నాను.

"ఎవ్వర్నీ ఏమి అడక్కుండా ఉండాలి. అందుకు ఒప్పుకుంటే నేను పందేనికి రెడీ" అంది మాధురి.

"ఓయస్ .. ఎవ్వర్నీ అడగను. వాళ్ళంతటవాళ్లే ఇస్తే తీసుకుంటాను అభ్యంతరంలేదు కదా"

"అలాగే. కాని మీరు ఓడిపోవడం ఖాయం. ఆ తర్వాత ఎప్పుడు ఎక్కడికి ప్రయాణం అయినా సరే లెస్ లగేజి లెస్ లగేజి అంటూ నా ప్రాణం తీయకూడదు ! సరేనా ! అంటూ చూపుడు వేలుతో నన్ను బెదిరిస్తూ అంది.

"సరే నువ్వు ఓడిపోతే అవి కావాలి ఇవి కావాలి అని సగం ఇల్లు సర్దేసి గంపల కొద్ది సామాన్లు సర్దిపెట్టి ప్రయాణానికి సిద్ధపడకూడదు మరి. నేను ఏవేవి తీసుకురమ్మంటే అవి మాత్రమే సర్దుకోవాలి ! సరేనా" అన్నాన్నేను ఆమె బుగ్గమీద చిటికేస్తూ.

"అలాగే" అంటూ తలూపింది మాధురి. ఆ మరునాడు మేము వెళ్ళేసరికి పెళ్లివారి ఇల్లంతా బంధువుల్తో సందడిగా ఉంది.

కుశల ప్రశ్నలు పరామర్శలు, పరాచకాల తర్వాత కాఫీలు టిఫెన్లు పూర్తయ్యాయి.

పిల్లలు పిల్లల్తో కలసి ఎటో వెళ్లిపోయారు ఆడుకుంటూ మాధురి బంధువులతో కబుర్లలో పడి ఎక్కడో కూర్చుంది. మా తోడల్లుడు తోనూ, మరి కొందరు కుర్రాకారుతోనూ అలా మెయిన్ బజారు వైపు వెళ్లాను నేను రిక్షాల్లో ఇంకా ఎవరెవరో చుట్టాలు స్నేహితులు ఎదురు వచ్చారు మాకు. వాళ్లను చిరునవ్వుతో పలకరిస్తూ మేము ముందుకు సాగాం అలా అలా తిరిగి పెళ్లి ఇంటికి వచ్చే సరికి ముహూర్తం దగ్గరపడటంతో అందరూ ఆ సన్నాహాల్లో ఉన్నారు. చీరెలు, పౌడర్లు నగలు... అంతా హడావుడి విడిదినుంచి బయల్దేరేరు మగపెళ్లివారు భజంత్రీలు వాయిద్యాలు హోరెత్తుతున్నాయి. పిల్లల పరుగులు పెద్దల అరుపులు వృద్ధుల హడావుడి మందలింపులు హెచ్చరికలు.... అంతా గందరగోళం !

పెళ్లి తంతు పూర్తయింది. భోజనాలుపూర్తిచేశాం. కుర్రకారు సినిమాకి వెళ్దామని గొడవచేస్తే నేను వాళ్లతో వెళ్లాను. సినిమా ఖర్చు నాదే. మధ్యలో కూల్ డ్రింక్స్ చిరుతిళ్లు సరేసరి సినిమా నుంచి తిరిగి వచ్చేసరికి మాధురి ఓ మూల ఒళ్ళు తెలీకుండాపడుకొని నిద్ర పోతోంది. నాకు నిద్రముంచుకు వస్తూండటంతో డాబా పైకి వెళ్లి పడుకున్నాను మిగిలినవాళ్లతో కలిసి. ఉదయంలేస్తూనే మాబాబాయ్ కొడుకు ఒకడు వచ్చి కూర్చున్నాడు వాడి చేతిలో బ్రష్ పేసు ఉన్నాయి.

"గురూగారు దంతధావనం లాగించేస్తేపోలా" అంటూ నా దగ్గరకు వచ్చాడు. వరసకు బావయిన మరొకడూ "అదే పని మీదు న్నాను ఉండండి బ్రష్ తెచ్చుకుంటాను" అని లేచాను.

'అబ్బా ! ఒక్కపూట బ్రష్ లేకుండా అడ్జెస్ట్ కాలేరా ? ఇదిగో పేస్టు ! వేల్తో లాగించేయండి' అంటూబలవంత పెట్టాడు బాబాయ్ కొడుకు

అలా అడ్జెస్టు అవడమే మంచిదనిపించింది.

"మామయ్యా ... మామయ్యా ! అర్జెంట్‌గా వెళ్లి స్నానం చేసెయ్ బాత్రూంలో వేన్నీళ్లున్నాయి. త్వరగా వెళ్లు" ఊపిరి సలప నివ్వకుండా నన్ను తరిమాడు మరో కుర్రాడు వెంటనే "ఇదిగో తువ్వాలు" అని అందించాడు ఆ కుర్రాడు.

అసలే చలికాలం పైగా నీళ్ల కరువు వల్ల చాలినన్ని నీళ్లు దొర కటం లేదు. ఎవరైనా బాత్రూంలో దూరితే వేన్నీళ్ల ఛాన్స్‌పోతుందని నేను త్వరపడ్డాను.

"పౌడరు తీసుకోండి గురువుగారూ ఫరవాలేదు" అంటూ నా చేతికందించాడు మరో కుర్రాడు. మిగతా మేకప్ సరంజామాతో సహా !

అలా ఉదయాన్నే నాకాలకృత్యాలన్నీ పూర్తయ్యాయి. ఈ మర్యాదలన్నీ రాత్రి నేను ఉదారంగా చేసిన ఖర్చుకు ఫలితమని అనుకొంటూ డాబాపై నుంచి కిందకు వెళ్లాను.

మాధురిజడ అల్లుకుంటూ కనపడింది. ఇంతకంటే మంచి అవకాశం రాదనుకుని దగ్గరగా వెళ్లాను "చూశావా ? తువ్వాలుతో గాని, సబ్బుతోగాని పనిలేకుండా నా కార్యక్రమాలన్నీ పూర్తిచేసు

కొన్నాను ; వద్దంటే వినకుండా అంత సామాను మోసుకొచ్చావు" అన్నాను దెప్పిపొడుస్తున్నట్లు.

"మీకు అన్నీ జరిగిపోతాయి ! మాక్కావాల్లెండి అయిన దానికి కాని దానికి వాళ్లని వీళ్లని దేబిరించటం నాకు చేతకాదు" అంటూ నిష్ఠూరం ఒలకపోసింది మాధురి. వెంటనే మళ్లీ "అన్నీతెచ్చు కోబట్టే ఎవరిర్నీ ఏమీ అడక్కుండా సరిపోయింది. ! పైగా నేనే వాళ్లకి వీళ్లకి ఇస్తున్నాను· కూడా" అందామె గర్వంగా నా కళ్లల్లోకి చూస్తూ !

"ఇదుగో ఊర్కే బడాయి కబుర్లు చెప్పకు ! అసలు మీ ఆడ వాళ్లంతా ఇంతే ! మీరు చేసినపని సమర్థించుకోవటానికి చూస్తారు ఇంతకి మన పందెం గుర్తుందా గెలుపునాదే మరి ఓడిపోయినట్లు ఒప్పుకున్నట్లేనా ! అన్నాను గర్వంగా" !

"అడుగో వస్తున్నతన్ని చూడు అతను అతని ముఠా వాళ్లు కలిసి నాకు కావలసినవన్నీ సప్లయ్ చేశారు. నా ఒక్కడికే కాదు· అవి అలా అలా చేతులు మారి డజను మంది దాకా వాటిని వాడు కున్నారు." అన్నాన్నేను మాధురితో.

అంతలో 'ఆంటీ'..ఇవిగో మీ పౌడరు డబ్బా సబ్బు, తువాళ్లు.. దువ్వెన అద్దం" అంటూలిస్టంతా చదివి అవన్నీ ఆమెకు అప్పగించి వెళ్లిపోయాడు నిన్నటి సినిమా కుర్రాళ్ల ముఠా నాయకుడు విషయం గ్రహించి నేను క్రమాన్నపడిపోయాను.

గర్వంగా నా వైపు చూస్తున్న మాధురి చూపుల్ని తప్పించు కుంటూ ఏదో పనున్నట్లు హడావుడిగా అక్కడి నుంచి బయట పడ్డాను నా గెలుపులోని ఓటమికి ఆశ్చర్యపోతూ !

( ఆంధ్రప్రభ దినపత్రిక ది. 23-10-88 )